క్లుప్తంగా

రైతుసేవా కేంద్రం ప్రారంభం



దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంఆర్‌పీ ధరలకే రైతులకు ఫర్టిలైజర్స్, సీడ్స్, పెస్టీసైడ్స్‌లు రైతు సేవా కేంద్రం ద్వారా లభిస్తాయని దుకాణం యజమానులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కిషన్‌రావు, మాజీ సర్పంచ్ స్వప్న, శ్రీకాంత్, నరేష్ కుమార్, ఆనంద్‌యాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభం



మిడ్జిల్: కాంగ్రెస్ గెలుపును ఆకాంక్షిస్తూ.. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి బైరంపల్లి నుంచి యాదగిరి గుట్ట వరకు చేపట్టిన పాదయాత్రను శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి బైరంపల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం ఇంత కష్టపడి పనిచేయడం ఎంతో సంతోషమన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. రబ్బాని, అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డికి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడలశాఖ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలో పలు క్రీడాసంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి సాధిక్‌అలీ పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని తిమ్మాసానిపల్లిలో శుక్రవారం మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మహిళలు భారీగా బీజేపీలో చేరారు. అంతకు ముందు ఆమె నివాసంలో కొత్తగంజ్, పెద్దదర్పల్లి, దొడ్డలోనిపల్లికి చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు, మహిళలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, దేశంలో 400 సీట్లు గెలవబోతున్నామని అందులో పాలమూరు సీటు పక్కా అన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆత్మకూర్: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున వడదెబ్బ తగులకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గ్రామీణ వైద్యుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి నిత్యం తాగాలని సూచించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఆశాకార్యకర్తలు, గ్రామపెద్దలు నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లన్న, రాంరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ అరుణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఆరెకటిక సంఘం కమిటీ ఎన్నిక

మిడ్జిల్: ఆరెకటికల మండల సంఘం నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు నరేందర్‌జీ తెలియజేశారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా శివ, ఉపాధ్యక్షులుగా నాగేష్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌జీ, గౌరవ అధ్యక్షుడు ఖాజారాంజీ, ఉపాధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి నందిశ్వర్‌జీ, శివరాములుజీ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానాలో సమస్యల తిష్ట



రాజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- పీహెచ్‌సీలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు
- ల్యాబ్ టెక్నీషియన్ లేక ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు

రాజాపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని ప్రభుత్వాలు, పాలకులు ప్రచారాలు చేస్తున్నా.. అది ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. జాతీయ రహదారిపై రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల వలయంలో పేరుకుపోయింది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు' అనే చందంగా మారింది. ఆస్పత్రిలో అత్యవసర చికిత్స చేయాలన్నా.. అందుబాటులో సిబ్బంది లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో జడ్చర్లకు చికిత్స నిమిత్తం వెళ్లక తప్పడం లేదు. ఆస్పత్రిలో మినరల్ వాటర్ మిషన్ ఉన్నా.. అది మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- గర్భిణులు కాన్పు కోసం వస్తే ఇద్దరు ఉండాల్సిన స్టాఫ్‌నర్స్‌ల స్థానంలో ఒక్కరే ఉండటంతో కాన్పుల కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. లేకుంటే రూ.వేలు ఖర్చు చేసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకుంటున్నారు.
- ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, డెలివరి రూంకు ఉన్న డోర్ గ్లాస్ పగిలిపోయి నెలలు గడుస్తున్నా.. దాన్ని మరమ్మతు చేయించే వారు కరువయ్యారు. అంతేకాకుండా ఆస్పత్రిలోని రూంలో పరిశుభ్రతను పాటించకపోవడంతో ఆస్పత్రికి రోగం నయం కోసం వస్తే కొత్త రోగం వచ్చిందని ఆస్పత్రికి వచ్చే రోగ్గులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీహెచ్‌సీలో కాన్పుల గది తలుపునకు పగిలిన అద్దం, కనబడకుండా కట్టిన దస్తులు



ఆస్పత్రిలో పనిచేయని వాటర్ ఫిల్టర్

సిబ్బంది లేక ఇబ్బందులు...

రాజాపూర్‌లో 5 సబ్‌సెంటర్లు ఉండగా.. ఒక్కో సబ్‌సెంటర్‌లో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాలి. మొత్తం పది మంది ఏఎన్‌ఎంలకు గాను ఆరుగురే ఉన్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు ఏఎన్‌ఎంలకు గాను ఒక్కరే ఉన్నారు. దీంతో ఆస్పత్రిలో కాన్పులు చేయలేకపోతున్నామని సిబ్బంది వాపోతున్నారు. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు రక్త పరీక్షలు చేయాలన్నా.. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో గర్భిణులు ప్రైటు ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ డిప్యూటేషన్ క్యాన్సల్ అయినా జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారుల అండదండలతో ఆస్పత్రిలోనే కొనసాగుతున్నాడు.

ఇక్కడ పరీక్షలు చేయడంలేదు..



గర్భం దాల్చిన మొదటి నెల నుంచి రాజాపూర్ ఆస్పత్రికి వస్తున్నా.. తొమ్మిది నెలలైంది ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేస్తలేరు. ఎందుకు చేయడం లేదని అడిగితే పరీక్ష చేసేవాళ్లు లేరని అంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లి పైసలు ఖర్చు చేసుకుని పరీక్షలు చేసుకుంటున్నాం. డెలివరి కూడా జడ్చర్లకు వెళ్లాలంటున్నారు. మా లాంటి పేదవారు సర్కర్ దవాఖానాకు వస్తే సరియైన వైద్యం అందడంలేదు.

– స్వప్న, గర్భిణి, రాజాపూర్

ఎప్పుడొచ్చినా ఎవరూ ఉండరు...



ప్రభుత్వ ఆస్పత్రి అని రాజాపూర్ పీహెచ్‌సీకి ఎప్పుడు వచ్చినా ఎవ్వరూ అందుబాటులో ఉండటంలేదు. పేరుకే మండల కేంద్రంలో సర్కార్ పీహెచ్‌సీ అన్నట్లు ఉంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని సిబ్బందిని నియమించి, 24 గంటలు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. మా బాబుకు కుక్క కరిస్తే ఇన్‌జెక్షన్ కోసం వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది.

– తిరుపతి, ఈద్గాన్‌పల్లి

కాన్పులు ఇక్కడే చేయాలి..

మా గ్రామలో సర్కార్ దవాఖానా ఉంది. కాని గతంలో ఇక్కడే కాన్పులు చేసేటోళ్లు. ఇప్పుడు ఇక్కడ చేయడంలేదు. మా లాంటి పేదవారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే స్థోమత లేదు. ఇక్కడనేమో కాన్పులు, రక్త పరీక్షలు చేస్తలేరు. పెద్ద సారోళ్లు చర్యలు తీసుకోవాలి.

– మౌనిక, రాజాపూర్

మద్యం పట్టివేత: కేసు నమోదు

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని బెల్ట్‌షాపుల్లో శుక్రవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వాకిటి బాల్‌రాజు కిరాణం దుకాణంలో అక్రమంగా ఉన్న 8 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాల్‌రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలియజేశారు.

రాఘవాపూర్‌లో..

రాజాపూర్: మండల పరిధిలోని రాఘవాపూర్‌లోని కిరాణ దుకాణంలో శుక్రవారం అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో గ్రామంలో తనిఖీ చేసి గ్రామానికి చెందిన లాల్య కిరాణ దుకాణంలో మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్ తెలియజేశారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో శనివారం సాయంత్రం 4 గంటలకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం కొనసాగనుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. దేవరకద్రలోని శ్రీనివాస గార్డెన్‌లో ఉమ్మడి మండలం దేవరకద్ర, కౌకుంట్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావే శం ఉంటుందని చెప్పారు. సమావేశానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు హాజరవనున్నట్లు చెప్పారు. దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మిడ్జిల్‌లో సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కోయిల్‌కొండ: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీరభద్రస్వామి దేవస్థానం వద్ద మండల స్థాయి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెంపర్ణికారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియెజకవర్గ సమన్వయకర్త కుంబం శివకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యపడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు సౌకర్యం పథకం ద్వారా మహిళలు లబ్ధిపొందారన్నారు. ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కాలేదని, ఎన్నికల తరువాత అమలవుతుందన్నారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేయడానికి పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం జరుగుతుందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్, జి.రవీందర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక మెజర్టీతో గెలిపించండి...

బాలానగర్: పాలమూర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న చల్లా వంశీచంద్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిత్యాలలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అండ..

మిడ్జిల్: సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఉమ్మడి మిడ్జిల్ మండలం నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ ఇచ్చి, సీఎంకి కానుకగా పార్లమెంట్ సీటు గెలిపించి ఇచ్చే బాధ్యత మీదేనని, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంవీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడితేనే నేడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే పది సంవత్సరాల్లో జడ్చర్లకు రూ.110 కోట్లు తీసుకొస్తే.. తాను గెలిచిన మూడు నెలలో రూ.150 కోట్లతో బీటీ రోడ్లను మంజూరు చేయించానని చెప్పారు. అనంతరం దాదాపు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివాసేనారెడ్డి, అల్వాల్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

నేడు హెచ్‌ఎంలకు వీఓఏ చైర్మన్లకు అవగాహన

మహమ్మదాబాద్/గండేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను వివరించేందుకు శనివారం గండేడ్ మండల రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. ఉదయం 10.13 గంటల నుంచి జిల్లా, మండల అధికారుల సమక్షంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేసే అభివృద్ధి పనుల గురించి పాఠశాలలకు వచ్చిన నిధుల ఖర్చు గురించి పాఠశాలల వీఓఏ చైర్మన్లకు, ఆయా పాఠశాలలో హెచ్‌ఎంలకు తగిన అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. హెచ్‌ఎంలు, వీఓఏ చైర్మన్లు తప్పకుండా హాజరుకావాలని వివరించారు.

రేపటి నుంచి రాములోరి బ్రహ్మోత్సవాలు

- 17న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం



కల్యాణానికి ముస్తాబైన సీతారాములు



కోదండరామస్వామి ఆలయం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు శుక్రవారం తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, అంకురార్పణ, 15న ధ్వజారోహణం, శ్రీ లక్ష్మీ హయగ్రీవ హోమం, 16న శ్రీ ధన్వంతరి హోమం, శ్రీ సుదర్శన హోమం, 17న సీతారాముల కల్యాణం, రథోత్సవం, 18న రామచంద్రుల వారి సామ్రాజ్య పట్టాభిషేకం, ఐశ్వర్యప్రాప్తి, మహాలక్ష్మీ హోమం, 19న చక్రస్నానం, మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం, ధ్వజారోహణం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పరిశీలన



మర్లులోని ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు శుక్రవారం పరిశీలన జరిపారు. ఇందులో ఏ పాఠశాలలో ఏయే పనులు చేపట్టాలో ఈపాటికే అమ్మ ఆదర్శ కమిటీలు అధికారులకు నివేదించాయి. దీంతో అన్ని ఇంజినీరింగ్ విభాగాల అధికారులు ఈ పాఠశాలల్లో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా పనులకు ఎంత ఖర్చు అవుతుందో ఎక్కడికక్కడే అంచనాలు రూపొందించారు. ఇక వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభయ్యేలోగా పూర్తి చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారామ సమేత విగ్రహ ప్రతిష్టాపన



నల్లగుట్టతండాలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం



ఆలయంలో సాయిబాబా విగ్రహం

బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాలలో సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి, కుమారస్వాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా చేసుకునే పండుగలతో గ్రామంలో ఒకరికొకరి సహకారాలు, సోదరభావాలు పెంపొందుతాయని, మన గ్రామం అనే ఆలోచనలు పెంపొందుతాయని అన్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో గణపతి హోమంలో పలువురు జంటలు పాల్గొన్నారు. ఉడిత్యాలలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన

భూత్పూర్: మున్సిపాలిటీలోని 1వ వార్డు నల్లగుట్ట తండాలో శుక్రవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్డు కౌన్సలర్ బాల్‌కోటి ఆధ్వర్యంలో గణపతి, కుమారస్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలకు జలాధివాసం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం గణేష్‌నగర్‌లోని షిర్డీ సాయి దేవాలయంలో శనివారం నుంచి 16వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి రోజు స్వామివారి అభిషేకంతో వార్షికోత్సవ పూజలు ప్రారంభమవుతాయి. 14న ఉదయం గణపతి పూజ, అంకుర్పారణ, సుప్రభాత సేవ, కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, సాయంత్రం సంధ్యాహారతి, నవగ్రహ హోమాలు నిర్వహిస్తారు. 15న ఉదయం సుప్రభాత సేవ, కాగడహారతి, 21 కలశాలతో స్వామి వారికి అభిషేకం, దత్తాత్రేయ మహామంత్ర సాయి మూల అనుష్టాన హోమాలు, కుంబాభిషేకం, పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వైభవంగా స్వామివారి పల్లకీసేవ నిర్వహించనున్నారు. పూజల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సంబంధించి శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ తెలియజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి హాజరవనున్నట్లు చెప్పారు.

జిల్లా కేంద్రంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్లమెంటరీ సమన్వయకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎస్‌ఏ.సంపత్‌కుమార్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి అసెంబ్లీ సమన్వయకర్తలు హాజరుకావాలని కోరారు.

చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని ఎంఎస్ పంక్షన్‌హాల్‌లో చిన్నచింతకుంట, కౌకుంట్ల, దేవరకద్ర మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి హాజరవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మక్తల్: హమాలీ కార్మిల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని శుక్రవారం ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి హమాలి కార్మికుడు లక్ష్మణ్ అధ్యక్షతన వహించారు. ఈ మేరకు.. వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్నటువంటి హమాలీ కార్మికులకు ప్రభు త్వం ఎలాంటి చట్టాలను అమలు చేయడం లేదని, కార్మికులు ప్రమాదాల బారిన పడిన బీమా సౌకర్యాలు కూడా కల్పించలేదన్నారు. కూలీ గిట్టుబాటుకాక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్‌ఐ చట్టాన్ని అమలు చేయాలన్నారు.

విజేతలకు నగదు అందజేత




మద్దూరు: నెలరోజులపాటు నిర్వహించిన ప్రీమియర్ లీగ్ విజేత మద్దూరుకు చెందిన డీవీఆర్ టీం గెలుచుకుంది. మద్దూరులోని గత నెల 15న ప్రీమియర్ లీగ్ పోటీని నిర్వాహకులు రామకృష్ణ, నాగరాజు, తలారి నరేష్, పిల్లగంట్ల బుజ్జి, వీరితోపాటు దార్‌కర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు మండలంలోని 10టీంలు పాల్గొన్నాయి. ఒక్కో టీం దాదాపు 10మ్యాచ్ ఆడాయి. శుక్రవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో మద్దూరుకు చెందిన డీవీఆర్ టీం, భీంపూర్‌కు చెందిన వారియర్ టీంలో తలపడగా హోరాహోరి మ్యాచ్‌లో మూడు రన్‌ల తేడాతో డీవీఆర్ టీం గెలుపొందింది. విజేతకు రూ. 51వేల నగదుతోపాటు ట్రోఫిని, రన్నర్‌ఫకు రూ. 25వేల నగదుతోపాటు ట్రోఫిని నిర్వాహకులు అందజేశారు. దార్‌కర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. గణపతి రవి, రామకృష్ణ, చందు, మహేష్, ప్రకాష్, శాంతకుమార్, నర్సింహారాజు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్టాపన



ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన సరస్వతీ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన శుక్రవారం వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామున అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దంపతులతో పూజారులు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అఖిలపక్ష పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



బిజినేపల్లి: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామ ఏకశిల గణపతికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఉత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామ అభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.